ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# మాండూస్‌తో ముద్దవుతున్న వరి

◆ అన్నదాత కన్నీళ్లు ◆ 947 ఎకరాల్లో నీరుచేరినట్లు వ్యవసాయశాఖ అంచనా
◆ జిల్లాలో 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



రాంబిల్లిలో నేలకొరిగిన వరి చేనులో దిగాలుగా ఉన్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

**మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోసిన వరిచేను తడిసి ముద్దవుతోంది. చేతికి రావాల్సిన పంట కళ్లముందే నీళ్లపాలవడంతో రైతులు కన్నీళ్లపర్యంతమవుతున్నారు. తడిచిన వరిచేను ధాన్యం నాణ్యత తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 947 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది.**

ఆదివారం ఉదయానికి తెరిపి ఇచ్చి, మధ్యాహ్నం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. వరి పొలాల్లో నీరు నిల్వలేకుండా కిందకు పోయేందుకు రైతులు జాడులు తీసినా, భారీగా వర్షం కురవడంతో చేనుపై నీరు చేరింది. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నాటికి 13.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. ఉదయం 8.30 గంటలకు ఐదు మిల్లీమీటర్లు వర్షపాతం నమోదుకాగా, ఆ తరువాత నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 8.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మూడ్రోజులపాటు కురిసిన వర్షాలకు జిల్లాలో 26 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మిగతా 2లో..

**మండలాల వారీగా నీటమునిగిన వరి వివరాలు**

| మండలాలు | గ్రామాలు | విస్తీర్ణం(ఎకరాల్లో) |
|---|---|---|
| 1.యలమంచిలి | 8 | 125 |
| 2.అనకాపల్లి | 15 | 96 |
| 3.అచ్యుతాపురం | 5 | 26 |
| 4.కశింకోట | 10 | 180 |
| 5.రాంబిల్లి | 2 | 15 |
| 6.ఎస్.రాయవరం | 6 | 165 |
| 7.కె.కోటపాడు | 3 | 35 |
| 8.కోటవురట్ల | 8 | 74 |
| 9.దేవరాపల్లి | 5 | 42 |
| 10.మాకవరపాలెం | 6 | 133 |
| 11.బుచ్చెయ్యపేట | 1 | 11 |
| 12.రావికమతం | 5 | 45 |



ప్రతిభ కనబరిచిన వారితో అతిథులు, నిర్వాహకులు

# శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం

**జెవివి విశాఖ జిల్లా చెకుముకి సైన్సు సంబరాల్లో వక్తలు**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జన విజ్ఞాన వేదిక (జెవివి) చెకుముకి సైన్సు సంబరాలు - 2022 ఆదివారం డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అట్టహాసంగా జరిగాయి. ఉదయం ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ఆర్.రమాప్రభ, పెందుర్తి గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ చేతుల మీదుగా చెకుముకి ప్రశ్నా పత్రాన్ని జెవివి విశాఖ కమిటీ సభ్యులు విడుదల చేశారు. అనంతరం 110 స్కూళ్ల నుంచి మండల స్థాయిలో టాపర్లుగా నిలిచిన 390 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పరీక్ష రాశారు. డాక్టర్ రమాప్రభ వివిధ పాఠశాలల నుంచి వచ్చిన టీచర్లు, తల్లిదండ్రులతో ప్రస్తుత సామాజిక సమస్యలు, ప్రభలుతున్న అశాస్త్రీయ భావాలపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జెవివి నిర్వహించిన సైన్సు క్విజ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి ఎసోసియేట్ డైరెక్టర్ కమ్ సైంటిస్ట్-ఎన్ఎస్‌టిఎల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతగా అభివృద్ధి మిగతా 2లో..

## నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజీ ప్రకటించాలి

▶ వార్త 5లో..

## సహకార ఉద్యోగులకు జిఓ 36 అమలు చేయాలి

▶ వార్త 5లో..

## ఘనంగా ముగిసిన మేయర్ కప్

▶ వార్త 2లో..




మాట్లాడుతున్న జగ్గునాయుడు

## ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటాలు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు

వార్త 2లో..

ఆధునిక వ్యవసాయంలో..

# బిందు సేద్యానిదే కీలక పాత్ర

◆ డ్రిప్‌తో నీరు, కరెంట్, పెట్టుబడులు ఆదా
◆ అధిక దిగుబడులు సాధ్యం
◆ రైతులకు రాయితీపై పరికరాలు
◆ 'ప్రజాశక్తి'తో ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎ.రహీం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వ్యవసాయంలో అధిక దిగుబడులు వచ్చేందుకు, పెట్టుబడులు, నీరు ఆదా అయ్యేందుకు నూతన వ్యవసాయ పద్ధతుల అమలు అత్యంత ముఖ్యం. అందులో బిందు సేద్యానిదే కీలక పాత్ర' - అని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రోగ్రాం (ఎపిఎంఐపి) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎ.రహీం వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో అభివృద్ధికి డ్రిప్ ఇరిగేషన్ ఎలా తోడ్పడుతుందో తెలిపారు. మరిన్ని ముఖ్య విషయాలనూ వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

**విశాఖ జిల్లాలో ఏయే మండలాల్లో మైక్రో ఇరిగేషన్ కార్యక్రమం సాగుతోంది ?**

విశాఖపట్నం జిల్లా విభజన అనంతరం గ్రామీణ మండలాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభంలలో వ్యవసాయ భూములు ఉన్నాయి. పెందుర్తి, గాజువాకల్లో ఉన్నా.. తక్కువ వ్యవసాయ భూమి మిగిలింది. విశాఖపట్నం జిల్లాలో ప్రధాన పంటలుగా మామిడి, కొబ్బరి, అరటి, బొప్పాయి, జామ, కూరగాయలు, పూలసాగును రైతులు చేపడుతున్నారు. అదేవిధంగా ఇతర పంటలు వరి, చెరుకు, మొక్కజొన్న, స్వీట్‌కార్న్ వంటివీ సాగులో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## మాండూస్‌తో ముద్దవుతున్న వరి

నాతవరంలో 24.4, అత్యల్పంగా నర్సీపట్నం మండలంలో 2.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మాండూస్ తుపానుతో కురిసిన వర్షాలకు 12 మండలాల్లోని 74 గ్రామాల్లో 947 ఎకరాల్లో కోసిన వరి చేనులో నీరు చేరినట్లు వ్యవసాయశాఖాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆదివారం ఉదయం క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి 947 ఎకరాల్లో నీరు చేరినట్లు నివేదిక ఇచ్చినప్పటికీ, ఆ తరువాత ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు తడిసిన వరిపంట విస్తీర్ణం రెట్టింపు కానుంది. రైతులు తమ పంట పొలాల్లో నీరు లేకుండా చేయడంతో పాటు తడిచిన చేనుపై ఉప్పునీరు స్ప్రే చేయడం, సురక్షిత ప్రాంతాలు, గట్లుపై చేనుపెట్టి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు సూచించారు.

**జిల్లాలో వర్షపాతం**

రాంబిల్లిలో 22.6, మునగపాకలో 20.8, యలమంచిలిలో 17.0, పరవాడలో 25.2 కశింకోటలో 22.8, సబ్బవరంలో 15.0, అచ్యుతాపురంలో 21.4, కోటవురట్లలో 5.8, నర్సీపట్నంలో 2.2, చీడికాడలో 5.0, కె.కోటపాడులో 12.6, మాకవరపాలెంలో 6.6, బుచ్చెయ్యపేటలో 14.6, ఎస్.రాయవరంలో 11.2, మాడుగులలో 4.0, రోలుగుంటలో 4.2, దేవరాపల్లిలో 8.2, రావికమతంలో 6.4, చోడవరంలో 9.2, నాతవరంలో 24.4 అనకాపల్లిలో 17.6, గొలుగొండలో 8.0, పాయకరావుపేటలో 17.2, నక్కపల్లిలో 15.4 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

## శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం

చెందుతున్నప్పటికీ సమాజంలో అశాస్త్రీయ భావాలు కూడా అంతే స్థాయిలో పెరుగుతున్నాయని, ఈ తరుణంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సరైన రీతిలో విద్యాభ్యాసం చేయాలని, ప్రశ్నించేతత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. మరో వక్త డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు చాలా ప్రమాదకరంగా మారాయని, అవి చాలా మంది ప్రాణాలను తీస్తున్నాయని, విద్యార్థులు హేతుబద్ధ ఆలోచనా విధానం అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థులు మాత్రమే శాస్త్రీయ సమాజాన్ని నిర్మించగలరని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న సన్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఎంఎన్.కుమారి, సీనియర్ న్యాయవాది రామాంజనేయులు, జిల్లా సైన్స్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం చెకుముకి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జివిఎంసి స్కూల్ మల్కాపురం, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఎంవిపి కాలనీ విద్యార్థుల టీంలను వచ్చే ఏడాది జనవరిలో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు విశాఖ జిల్లా నుంచి ఎంపిక చేశారు. క్విజ్ పోటీలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ పెందుర్తి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఎంవిపి, భాష్యం స్కూల్ ఎన్ఎడి విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు, ప్రైజ్‌మనీ అందజేశారు. సైన్సు పరీక్షకు కన్వీనరుగా ఎస్‌వికె.పరశురాం, క్విజ్ పోటీ నిర్వహణకు కో - ఆర్డినేటరుగా ఇందు శ్రీనివాసన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జెవివి విశాఖ అధ్యక్షులు శుభాకర్, ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిందు సేద్యానిదే కీలక పాత్ర

ఉన్నాయి.

**పంటల మొత్తం విస్తీర్ణం ఎంత ? ఎపిఎంఐపి ద్వారా ఎంత చేపట్టారు ?**

విశాఖ జిల్లాలో ఈ పంటల సాగు ఐదు వేల హెక్టార్లపై మాటే. ఇప్పటివరకూ రెండు వేల హెక్టార్లకు పైగా బిందు సేద్యాన్ని అమలు చేశాం. ఇంకా 2500 హెక్టార్లు ఉన్నాయి. ఈ ఏడాది 2022-2023కిగానూ 400 హెక్టార్లను లక్ష్యంగా ఇచ్చారు. ఇప్పటి వరకూ 71 మంది రైతులు 59.18 హెక్టార్లలో బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంట్లో 28 మంది రైతులు 24.98 హెక్టార్లలో డ్రిప్ కోసం, 43 మంది రైతులు 34.20 హెక్టార్లలో స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 39 మంది రైతులకు 30.96 హెక్టార్లకు స్ప్రింక్లర్లను మంజూరు చేశాం. ఇంకా రైతులు ఎవరైనా ఉంటే రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలను కలిసి ఆయా మండలాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

**రైతులు ఏ పత్రాలు చూపాలి ?**

ఆధార్‌కార్డు, భూమి తాలూకా 1బి కాపీ, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ కాపీ, ఫోన్ నెంబరును ఆర్‌బికేల్లో సమర్పించాల్సి ఉంది. ఈ అవకాశం కొత్త రైతులతో పాటు ఏడేళ్ల క్రితం డ్రిప్ ఇరిగేషన్‌లో సబ్సిడీ పొందిన రైతులకు కూడా వర్తిస్తుంది. అదే విధంగా ఒక బోర్‌వెల్ ఉన్న రైతు పక్కన ఉన్న రైతులకు కూడా వాటర్ షేరింగ్ ఇస్తూ సేద్యం చేయగలిగితే సబ్సిడీ అందరికీ వర్తించే విధానం తీసుకున్నాం. ఈ అవకాశాన్ని రైతులు ముందుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలి.

**విశాఖ జిల్లాలో పంటలకు మార్కెట్ ఎలా ఉంది?**

పైన తెలిపిన పంటల సాగుకు రోజువారీగా విశాఖ జిల్లాలోని పలు మార్కెట్లలో డిమాండ్ అధికంగా ఉంది. సాగు భూములను మరింతగా సారవంతం చేసుకోవడం, ప్రభుత్వ సబ్సిడీలను వినియోగించుకుని అధిక దిగుబడి సాధించే నూతన వ్యవసాయ డ్రిప్ పద్ధతులను రైతు సోదరులు వినియోగించుకోవాల్సి ఉంది. దీంట్లో ఎపిఎంఐపి అధికారులు బిందు సేద్యానికి ద్వారాలు తెరిచారు. ఈ బిందు సేద్యం ద్వారా 70 నుంచి 90 శాతం వరకూ సాగునీరు, 60 - 80 శాతం విద్యుత్, 40 - 50 శాతం పెట్టుబడులు ఆదా అవుతాయి. లేబర్ ఛార్జీలు కూడా రైతులకు భారీగా తగ్గుతాయి. లేబర్, ఫెర్టిలైజర్లకు అయ్యే ఖర్చులు నామమాత్రంగా ఉంటాయి. పంట తాలూకా దిగుబడి, నాణ్యత గణనీయంగా ఈ సేద్యంలో ఉంటుంది. ఎపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా బిందు సేద్యం పరికరాలన్నింటినీ సబ్సిడీతో రైతులకు అందిస్తున్నాం. ఐదు ఎకరాల లోబడి భూమి ఉన్న రైతుకు డ్రిప్‌పై 90 శాతం, స్ప్రింక్లర్‌పై 55 శాతం రాయితీ లభిస్తుంది. 5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల భూమి ఉన్న రైతులకు డ్రిప్‌పై 50 శాతం, స్ప్రింక్లర్‌పై 45 శాతం సబ్సిడీ లభిస్తుంది.

# ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటాలు

**సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు**
**ఉత్తేజం నింపిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ మహాసభలు**

**ప్రజాశక్తి - ఉక్కునగరం**

ఐక్యంగా పోరాడితే ఉక్కు పరిరక్షణ సాధ్యమేనని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న ఉక్కు పరిశ్రమను పోరాటాల ద్వారానే రక్షించుకుంటామని అన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) 13వ మహాసభ రెండో రోజైన ఆదివారం ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. కార్మికులు, ప్రజలు తిరుగుబాటు చేస్తే ఎంతటి వాడైనా తలవంచక తప్పదన్నారు. మహాసభలో ప్రధాన కార్యదర్శి నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇఎస్ఐలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉక్కు అమ్మకాన్ని వెంటనే ఆపాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని పలు తీర్మానాలు చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఒ.వి.రావు. అధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.కన్నబాబు, ప్రధాన కార్యదర్శిగా నమ్మి రమణ, ఉప ప్రధాన కార్యదర్శిగా పి.మసేను, ఉపాధ్యక్షులుగా కెఎం.శ్రీనివాసరావు, డి.పాండే. వి.వరహాలు, సి.హెచ్.నర్సింగరావు, కెపి సుబ్రమణ్యం, వి.వి.రమణ, కార్యదర్శులుగా ఎన్.కృష్ణ, పి.నారాయణరావు, కోశాధికారిగా వై.శ్యామ్ సుందర్‌లతో పాటు నలభై మంది ఆఫీసు బేరర్లుగా ఎన్నికయ్యారు.

# జాన్‌వెస్లీకి సన్మానం


జాన్‌వెస్లీని సన్మానిస్తున్న నిర్వాహకులు

**ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ :** ఏలూరు సిటీ కార్మెల్ మినిస్ట్రీస్ నిర్వహించిన డివైన్ క్రిస్టమస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపి స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు ఘనంగా సన్మానించారు. చిన్నారుల క్రిస్మస్ సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. అనంతరం నిర్వాహకులు భక్తులకు వస్త్రాలు బహూకరించారు. చివరిగా క్యాండిల్ సర్వీస్ నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్మెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ టి ఎబినేజర్ శాస్త్రి, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** చారిటీ బాక్సు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అల్లిపురంలోని భీమనగర్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. చారిటీ బాక్సు సభ్యురాలు ఉమాకుమారి ఈ దుప్పట్లకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాదీ చలికాలంలో దుప్పట్ల పంపిణీ ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ పరంపరను కొనసాగిస్తూ ఈ ఏడాది చారిటీ బాక్సు ఆధ్వర్యంలో పంపిణీ చేశామన్నారు. 70 మందికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశామని తెలిపారు. చారిటీ బాక్సు సభ్యులు దౌలూరి శంకరరావు, వురిటి శ్రీనివాసరావు, కత్తుల భీమారావు మాట్లాడుతూ చారిటీ బాక్సును ఏదో ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా, వివిధ జిల్లాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొంతం శివాజీ ప్రసాద్, లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

## 18న 'అనుభవ జ్ఞానోదయం'

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఈ నెల 18న ఆంధ్ర యూనివర్శిటీ అవుట్ గేట్ వైపు ఉన్న గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు అనుభవ జ్ఞానోదయం పేరిట ఓ కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మీడియాతో వారు మాట్లాడారు. ది వరల్డ్ సెంటర్ ఫర్ ఎన్‌లైన్‌మెంట్‌కు చెందిన ప్రీతాజీ, కృష్ణాజీలు పాల్గొంటారని తెలిపారు.

# జర్నలిస్టులకు అవగాహన సదస్సులు

**ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ప్రెస్ అకాడమీ ద్వారా గతంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించే వారని, వాటికి బదులు ఇప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వైజాగ్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోరం తరపున కొమ్మినేని శ్రీనివాసరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన 'పాత్రికేయులు - సమకాలీన అంశాలు'పై మాట్లాడారు. జర్నలిస్టులు సమాజ హితులని అన్నారు. జర్నలిస్ట్ వృత్తిని ఇతర వాటితో పోల్చుకోవద్దన్నారు. జర్నలిస్టులలో వినూత్న పోకడలు అసలు ఉండకూడదన్నారు. వార్తలలో వాస్తవానికి వన్నె తెచ్చి ప్రజల మన్ననలు పొందాల్సిందేనన్నారు. జర్నలిజం అనేది పవిత్రమైన వృత్తి అని, అయితే తెలిసో తెలికో ఈ వృత్తిలోకి వచ్చి కొనసాగుతున్న వారంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమాజానికి హితం చెప్పే వారు జర్నలిస్టు అనేలా ఉండాలన్నారు. తన హయాంలో జర్నలిస్టులు అందరూ విలువలతో కూడిన జర్నలిస్టులుగా ఉండాలనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థ బాగున్నా, బాగుండకపోయినా జర్నలిజం వ్యవస్థ మాత్రం నిజాయితీతో ఉండాల్సిందేనన్నారు. ఒక్క రోజులోనే సమాజంలో మార్పు వస్తుందని ఆశించనక్కర్లేదన్నారు. సమాజంలోని మంచిని ఆశించే వారి కోసం, సమాజం మేలు కోసం జర్నలిస్టులు పాటుపడాలని సూచించారు. జర్నలిస్టులు నిజాలు రాస్తే ఒకింత ఒత్తిడి పెరిగినా, అది గర్వంగా ఉంటుందన్నారు. అబద్ధ వార్తలు రాసి ఒత్తిడి తెచ్చుకోవడం ఎవరికీ మంచిది కాదన్నారు. కార్యక్రమంలో వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, సీనియర్ పాత్రికేయులు ప్రభాకర్ శర్మ, ప్రెస్ అకాడమీ కార్యదర్శి తిలక్ పాల్గొన్నారు.

## కెజిహెచ్‌కు జెడి ఫౌండేషన్ 50 వీల్ ఛైర్స్ వితరణ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో జెడి ఫౌండేషన్ 50 వీల్ ఛైర్లను ఆదివారం కెజిహెచ్‌కు అందజేసింది. వీల్‌ఛైర్లను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలి స్వీకరించారు. ఈ సందర్భంగా జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి మీడియాతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో సంవత్సర కాలంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.

## ఘనంగా ముగిసిన మేయర్ కప్

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** డీసెంట్ షోటోకాన్ మార్షల్ ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ మేయర్ కప్ 2022 పోటీలు స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదన్నారు. నగరం నుంచి ఎంతోమంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణించి దేశ, విదేశాలలో వారి ప్రతిభను కనబరుస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం ఈ పోటీల్లో కాటా, కుముది విభాగాలకు సంబంధించి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మెన్స్, క్యాడెట్స్‌లో పాల్గొన్న 1480 బాల బాలికలకు మేయర్ అభినందనలు తెలిపారు. ఈ కరాటే పోటీలలో మొదటి బహుమతిని దక్కించుకున్న విశాఖపట్నంకు చెందిన మిజి షోటోఖాన్ టీమ్ క్రీడాకారులకు, రెండో బహుమతి దక్కించుకున్న విజయనగరం చెందిన కుముది టీమ్ క్రీడాకారులకు, మూడో బహుమతి దక్కించుకున్న శ్రీకాకుళానికి చెందిన షోటోఖాన్ టీమ్ క్రీడాకారులకు మేయర్ అభినందనలు తెలిపి ట్రోఫీలను అందజేసి సత్కరించారు. ఈ కరాటే పోటీల ముగింపు కార్యక్రమాల్లో డీసెంట్ షోటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజర్ దువ్వి గోవింద్ యాదవ్, కార్పొరేటర్ నక్కెళ్ల లక్ష్మి, వైసిపి కార్యకర్త దాడి సత్యనారాయణ, కరాటే పోటీల ప్రతినిధులు నాయుడు, కె.సుమన్, వి.రవీంద్ర పాల్గొన్నారు.

# కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం...

## కోసిన పంట... పొలాల్లో
## వర్షాలతో రైతాంగం ఆందోళన
## గోదాములు లేక కుప్పలుగా ఆరుబయట దర్శనం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** సాధారణంగా వ్యవసాయ మంటేనే భారంగా మారిన ప్రస్తుత కాలంలో, ప్రకృతి కూడా పగబట్టడంతో రైతాంగం ఒకింత ఆందోళనకు గురవుతోంది. భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న రైతాంగం పూర్తిగా వర్షాధారం పైనే ఆధారపడి ఉంది. వరి పంట కోసిన తర్వాత కళ్లాల్లో, పంట పొలాల్లో ధాన్యం పోగులుగా ఉన్న ప్రస్తుత పరిస్థితి రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది. తడిసి ముద్దయిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాదేమోనన్న భయం రైతుల్లో ఉంది. ప్రభుత్వ విధానాలు ఓ వైపు, ప్రకృతి మరోవైపు రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. భీమిలి మండలంలో కంటే ఆనందపురం, పద్మనాభం మండలాల్లో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. వరి కోతలు కూడా ఎక్కువ శాతం జరిగాయి. వ్యవసాయ విధానంలో యాంత్రీకరణ ప్రవేశంతో కూలీల స్థానంలో యంత్రాలతో పంట కోశారు.

**రైతు కళ్ళల్లో దైన్యం...**

ముందుగా కోతలు జరిగిన ఆనందపురం మండలం బోని, శిర్ల పాలెం, పద్మనాభం మండలం మద్ది, బాందేవుపురం, విలాస్ఖాన్‌పాలెం, భీమిలి మండలం దాకమర్రి, టి.నగరపాలెం తదితర గ్రామాల్లో వరి పంట పొలాల్లోనూ, కళ్ళాల్లోనూ ఉందని పలువురు రైతులు వాపోతున్నారు.

**గోదాములు అవసరం**

ప్రతి మండల కేంద్రంలోనూ ధాన్యం నిల్వలకు అవసరమైన గోదాములు నిర్మిస్తే ఉపయోగమని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు. పంట సాగు విస్తీర్ణం, ధాన్యం సేకరణపై ఏటా ఒక స్పష్టత ఉన్నందున అందుకు తగ్గట్టుగా గోదాములు నిర్మిస్తే ఉపయోగమని పలువురు రైతులు భావిస్తున్నారు. ధాన్యం గోదాముల్లో నిల్వ ఉంచినట్లయితే తుపాన్లు వచ్చినా నష్టం వాటిల్లదని రైతులు అంటున్నారు.

### ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి

ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిస్తే ఉప్పును నీళ్లలో కలిపి గానీ, పొడి రూపంలో గానీ వాడవచ్చు. కిలో ఉప్పును 20 లీటర్ల నీటిలో కరిగించి ద్రావణాన్ని పనల మీద చల్లాలి. ఉప్పు పొడి అయితే ఎకరాకు 40 నుంచి 60 కిలోల పొడిని పనల మీద కంకులకు తగిలేటట్టు సమానంగా చల్లాలి. కల్లంలో ధాన్యం తడిచి 2, 3 రోజులు ఎండబెట్టడానికి వీలు కుదరక పోతే క్వింటాలు ధాన్యానికి కిలో ఉప్పుపొడి చల్లాలి.



**బొడ్డేపల్లి విజయ ప్రసాద్**
**అసిస్టెంట్ డైరెక్టర్**
**వ్యవసాయ శాఖ, భీమిలి**



పద్మనాభం మండలం పొంద్రంగి పొలాల్లో కోసిన వరి చేను

### డైట్‌లో పరీక్షకు 17 మంది హాజరు

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** స్టేట్ అసెస్మెంట్ సెల్ రిక్రూట్‌మెంట్ -2022 పరీక్ష ఆదివారం స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో జరిగింది. 34 మంది అభ్యర్థులకుగానూ 17 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, రాష్ట్ర పరిశీలకులుగా ఎస్ఇఆర్‌టి నుంచి దండె పాల్ హాజరయ్యారు. పిపి 1 క్లాస్, 2 పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, విషయ నిపుణుల పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగింది. డిఇఒ కార్యాలయం నుంచి ఎస్‌విఎస్ రమేష్, పిప్రభాకర్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.



కారుషెడ్ వద్ద ట్రాఫిక్ సమస్యలపై సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

### ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**ప్రజాశక్తి -మధురవాడ, పిఎం.పాలెం :** ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ట్రాఫిక్ ఎడిసిపి అరిఫుల్లా పేర్కొన్నారు. జాతీయ రహదారిపై కారుషెడ్డు కూడలి వద్ద జోన్ 1 ట్రాఫిక్ ఎసిపి కుమార్ స్వామితో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రద్దీ సమయంలో కారు షెడ్ కూడలి, క్రికెట్ స్టేడియం, కొమ్మాది కూడలి వద్ద తీసుకోవాల్సిన జాగత్తలపై పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ట్రాఫిక్ సిఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి




మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు, హాజరైన కార్మికులు

**ప్రజాశక్తి -మధురవాడ :** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లోకార్మికులు తగిన బుద్ధి చెబుతారని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మధురవాడ జోన్ మహాసభలను ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద ఆదివారం నిర్వహించారు. భవన నిర్మాణ సంఘం నాయకులుగా పనిచేసి ఈ మహాసభ కాలంలో మరణించిన పిళ్లా రాము చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఉపాధ్యక్షులు కుమార మంగళం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కాలంలో మరణించిన నాయకులకు మహాసభలో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మహాసభలో ముఖ్య అతిథులు కుమార మంగళం, ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి కార్మిక చట్టాలను మార్పుచేసి యాజమానులకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మికుల హక్కులను హరించడమే అన్నారు. నరేంద్రమోడీ అడుగులకు మడుగులు ఒత్తుతూ రాష్ట్ర ప్రజలను, కార్మికులను జగన్మోహన్‌రెడ్డి కడగండ్ల పాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు, కార్మికులు, కర్షకులు ఇక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిజాయతీ, క్రమశిక్షణ గల సిఐటియులో చేరాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మహాసభ నివేదిక ప్రవేశపెట్టారు. చర్చలు అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుకొని ముందుకు సాగాలని డి.అప్పలరాజు, జి.మంగశ్రీ, పి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన మహాసభ నిర్ణయం తీసుకుంది.

**నూతన కమిటీ**

నూతన కమిటీ అధ్యక్షులుగా డి.కొండమ్మ, ప్రధాన కార్యదర్శిగా పి.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జి.మంగశ్రీ, డి.అప్పలరాజు, పి.రాజశేఖర్, కార్యదర్శులుగా సిహెచ్ శేషుబాబు, జిన్నారం, ఎం.కనకరత్నం, కోశాధికారిగా అంపోలు భాస్కరరావు, కమిటీ సభ్యులుగా ఎస్.రామప్పడు, టి.రమేష్‌బాబు, జి.విజయ్, యు.కుమారి, బి.లక్ష్మి, పి.వరలక్ష్మి, కె.ఈశ్వరరావు, యు.శాంతి, జి.కిరణ్, గణేష్ తదితరులను ఎన్నుకున్నారు.

## విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షునిగా పోతిన



**ప్రజాశక్తి- భీమునిపట్నం :** విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షునిగా భీమిలి మండలం తాళ్లవలస విఆర్ఒ పోతిన వెంకట అప్పారావు ఎన్నికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు పదేళ్లుగా సంఘం డివిజన్ అధ్యక్షునిగా పని చేశారు. విభజిత విశాఖ జిల్లాలో సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఇతని స్వస్థలం ఆనందపురం మండలం, పెద్దిపాలెం గ్రామం. ఆదివారం సబ్బవరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఇ.శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి -గాజువాక :** ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం శ్రీనగర్‌లో చోటుచేసుకుంది. శ్రీనగర్‌కు చెందిన బి.రూపేష్ (27)కు మల్కాపురం చెందిన ఝాన్సీతో వివాహమై ఆరు నెలలైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. భార్య లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రెండు వేర్వేరు కేసుల్లో గుట్టుగా తరలుతున్న గంజాయిని సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎసిపి టాస్క్‌ఫోర్స్ త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ దగ్గర ఉన్న కావేరి ట్రావెల్స్ వద్ద గంజాయి శిబిరంపై దాడులు నిర్వహించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురుగన్ నిత్యనందన్‌ను అదుపులోకి తీసుకున్నారు. 26 కిలోల గంజాయిని అతని వద్ద స్వాధీనం చేసుకున్నారు.


మరొక కేసులో కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కప్పరాడ ఎస్‌టి బాయ్స్ హాస్టల్ వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వేలీకి చెందిన పూజారి సుబాష్, డుంబ్రిగుడ మండలం కించుమండ గ్రామానికి చెందిన బురిడి సోమేశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.




ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పర్వత యాత్ర

### ప్రపంచ పర్వత దినోత్సవం

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక సంగివలస అనిల్ నీరు కొండ దంత వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఆదివారం ప్రపంచ పర్వత దినోత్సవం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మడగడ పర్వత ప్రాంతంలో 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డిసెంబర్ 10, 11 తేదీల్లో సాహస యాత్ర చేశారు. పర్వతాల ఆవశ్యకత, ఆదివాసీల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించేందుకు ఏటా డిసెంబర్ 11న ప్రపంచ పర్వత దినోత్సవం జరుపుకోవాలని ఐక్య రాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ యాత్ర చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శివకుమార్, అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ మూర్తి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



బిందు హాసినితో కలిసి వేదికపై పలువురు నేతలు

### ఆనందపురంలో రాజకీయ నేతల సందడి

**ప్రజాశక్తి - ఆనందపురం :** ఆనందపురం గ్రామంలో ఆదివారం ఎక్కడ చూసినా రాజకీయ నేతల సందడి కనిపించింది. శినగం రామారావు కుమార్తె బిందు హాసిని ఓణీల ఫంక్షన్‌కు టిడిపి నాయకులు చిక్కాల విజయబాబు సహా పలువురు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బిందు హాసినిని దీవించారు. కార్యక్రమంలో నాయకులు బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, తాట్రాజు అప్పారావు, టి.అప్పలరాజు, శినగం రామారావు, పెద్ద రామారావు, పోతన గోవిందరావు, లంక నర్సింగరావు, చందక అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్ అన్నారు. ఆదివారం గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయం సంస్థ కార్యదర్శి గ్రంథాలయంలోని ప్రతి విభాగం గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకోడానికి గ్రంథాలయం చక్కటి అవకాశంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఏ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు

## 14న రాజ్‌కపూర్‌పై డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : హిందీ సినిమా నటుడు రాజ్‌కపూర్ 98వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న సాయంత్రం ఐదు గంటలకు గ్రంథాలయంలో ఆయనపై ఫిల్మ్ డివిజన్ రూపొందించిన డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ప్రదర్శిస్తామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జి రఘురామారావు, ఆచార్య ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## కల్యాణ మండపం కోసం జనసేన నిరాహారదీక్ష

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ గ్రామంలో కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తేవాలంటూ జనసేన నాయకులు ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, సచివాలయం కోసం కల్యాణ మండపాన్ని తీసుకొని ఆరు నెలల్లో ప్రత్యామ్నాయం చూసుకుంటామని చెప్పి నేటికీ కల్యాణ మండపం అప్పగించలేదని తెలిపారు. శుభకార్యాలు, సమావేశాలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. జనసేన నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారావు, చైతన్య, గవర శ్రీను, ప్రవీణ్, తేజ, గిరి, పార్వతి, మీనాక్షి, జయ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం భారతి విద్యానికేతన్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1990-91లో జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న 50 మంది ఒకే చోట చేరుకొని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత అనుభవాలను పంచుకున్నారు. భారతీయ విద్యా నికేతన్ పాఠశాల అధినేత దొంతల రామారావు మాట్లాడుతూ, 32 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులంతా ఒకే చోట చేరి వారి అనుభవాలను పంచుకోవడం అభినందనీయమన్నారు. కొత్త భీమసింగ్‌కు చెందిన ఒక పేద పాపకు గుండె ఆపరేషన్‌కు స్నేహితులందరూ కలిసి రూ.27 వేలు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. పలు జాతరలలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రూపు సభ్యులు ఎవరికైనా సమస్యలు వస్తే చేయూతనందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అందవరపు శ్రీను, బసవరాజు, మజ్జి హరికృష్ణ, బాలాజీ, మన్మధ, సూర్యారావు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రాపై కర్ణాటక జట్టు విజయం

ప్రజాశక్తి- మధురవాడ : తానా ఆధ్వర్యాన గీతం విశ్వవిద్యాలయంలో ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన దక్షిణ భారత వికలాంగుల క్రికెట్ పోటీలలో ఆదివారం ఆంధ్ర జట్టుపై కర్ణాటక విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. జట్టులో సాగర్ లమని 14 ఫోర్లతో చెలరేగి 78 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రజట్టు 18 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 133 పరుగులు సాధించింది. ఆంధ్ర జట్టులో ఎమ్.సంతోష్ 9 ఫోర్లతో 54పరుగులు చేశాడు. విజేతలను తానా క్రీడా విభాగం కో-ఆర్డినేటర్ శశాంక్ యార్లగడ్డ అభినందించారు.


గెలుపొందిన వికలాంగ క్రికెట్ క్రీడాకారులు

# మహిళలకు రక్షణ దిశ యాప్



### దిశ ఎసిపి సిహెచ్ వివేకానంద

ప్రజాశక్తి -మధురవాడ : దిశ యాప్ మహిళలకు రక్షణ అని, మహిళలకు ఎక్కడైనా ఎప్పుడైనా ఎటువంటి సమస్య వచ్చినా పోలీస్ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది కూడా తక్షణమే స్పందించి వారికి తగురీతిలో సహాయ సహకారాలు అందిస్తారని విశాఖపట్నం దిశ పోలీస్‌స్టేషన్ ఎసిపి సిహెచ్.వివేకానంద తెలిపారు. దిశ యాప్ ద్వారా అందే సేవలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూ....

**దిశ పోలీస్ స్టేషన్ ఎప్పుడు ఏర్పాటు చేశారు?**

2009లో మహిళా పోలీస్‌స్టేషన్‌గా ప్రారంభించి 2014లో ఏసీపీ స్థాయి అధికారిని స్టేషన్ హౌస్ ఆఫసర్‌గా నియమించారు. 2020లో దిశ పోలీస్ స్టేషన్‌గా మార్పు చేశారు.

**దిశా యాప్ ద్వారా ఏవిధమైన సేవలు అందుతాయి?**

మహిళలు కోసం ప్రభుత్వం ఎస్ఒఎస్ యాప్‌ను ఏర్పాటు చేసింది. ఈ యాప్ ద్వారా అధిక సంఖ్యలో మహిళలు యాక్టివ్‌గా ఉన్నారు. ఇందులో 112, 100 ఫోన్ నెంబర్స్‌ను మహిళ రక్షణ కోసం ఏర్పాటుచేశారు. మహిళలు ఎవరైనా ఆపదలో ఉండి ఆ నెంబర్లకు ఫోన్ చేస్తే పోలీసులు స్పందిస్తారు.

**దిశా యాప్‌పై స్పందన ఎలా ఉంది? ఆ యాప్ ద్వారా ప్రజలకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు?**

దిశా యాప్‌పై స్పందన బాగుంది. ఇప్పటికి సుమారు 20 లక్షల మంది ఎస్ఒఎస్ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా ఇప్పటికి 126 ఫిర్యాదులు స్వీకరించాం. పెట్రోలింగ్ వాహనాల ద్వారా బీచ్ అంతటా పరిశీలించి అశ్లీల కార్యక్రమాలు జరగకుండా, మహిళలకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాల వినియోగం తదితరాలపై కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద దిశ కౌన్సెలింగ్ స్టేషన్ ఏర్పాటుచేసి ప్రతి మంగళవారమూ, గురువారమూ కొంతమంది మహిళా సిబ్బంది ద్వారా అక్కడకు వచ్చే మహిళలకు పలు అంశాలపై కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట రక్షణ భద్రత కల్పించడమే దిశ యాప్ ముఖ్య ఉద్దేశం.

**వన్ స్టాప్ సెంటర్ ఎక్కడ ఉంది? అది ఎలా ఉపయోగపడుతుంది?**

వన్ స్టాప్ సెంటర్‌ను కెజిహెచ్ దగ్గర ఏర్పాటుచేశాం. ఇక్కడ మహిళా బాధితులు వారి సమస్యలు చెప్పుకోవడానికి, వారి ఫిర్యాదుల స్వీకరించడం, బాధితులకు కావలసిన అవగాహన కల్పిస్తున్నాం.

**గ్రామ సచివాలయంలో మహిళలకు ఇచ్చే సూచనలు ఏమిటి?**

గ్రామ సచివాలయంలో సుమారు 600 మంది విధులు నిర్వహిస్తున్నారు. మహిళలకు ఎక్కడ ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నాం. కళాశాలలు, యూనివర్సిటీలు వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పాఠశాల వద్ద చిన్న పిల్లలకు గుడ్ టచ్ బాడ్ టచ్ పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

# ప్రజలందరికీ ఆరోగ్య సేవలందాలి

### కాంగ్రెస్ ఒబిసి రాష్ట్ర చైర్మన్ వెంకటరావు

ప్రజాశక్తి-మాధవధార : ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా భారతదేశ ప్రజలందరికీ అవసరమైన అన్ని ఆరోగ్య సేవలు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. ఐక్యరాజ్యసమితి 2012 డిసెంబర్ 12న చేసిన యూనివర్సల్ హెల్త్ కవరేజ్ తీర్మానం ఇప్పటికీ అమలులో లేదని తెలిపారు. ఆరోగ్య సేవలను పొందే హక్కును ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలని, ప్రజారోగ్యానికి నిధులు 3 నుంచి 5 శాతానికి పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని కోరారు. దశల వారిగా మద్యం వాడకాన్ని తగ్గించాలని, మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని, గిరిజన, కొండ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య చర్యలు తీసుకోవాలని, ఔషధ రంగంలో దోపిడిని అరికట్టాలని, వైద్యులంతా జనరిక్ మందులనే సూచించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య ప్రణాళిక రూపకల్పనలో, వ్యవస్థల నిర్వహణలో, పర్యవేక్షణలో ప్రజల భాగస్వామ్యం అద్భుతమైన పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలు అన్ని రకాల ఆరోగ్య సేవలను ఉచితంగా అందించే దిశగా ప్రయత్నిస్తుంటే, భారతదేశంలో ఇంకా ఎంపిక చేసిన చికిత్సలనే ఉచితంగా ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ఏ దేశ అభివృద్ధి అయినా అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుందన్నారు. దేశ ప్రధాన మంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.

# 'ఉత్తరం'లో పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. వారికి ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ ఆసరా ఇచ్చేలా చేపడుతున్న సంక్షేమానికి తమ వంతుగా ప్రజలు 175 స్థానాల్లో విజయాలనిచ్చి ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని కోరారు. జనసేన పార్టీ నుంచి సీతంపేట ప్రాంతానికి చెందిన సమ్మెట్ల వెంకటేష్ వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కార్పొరేషన్ చైర్మన్ సుజాత, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, కంపా హనోక్, అనీల్‌కుమార్‌రాజు, ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, ద్రోణంరాజు శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.


వైవి సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరిస్తున్న సమ్మెట్ల వెంకటేష్

# జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -మధురవాడ : బెంగళూరులో ఈ నెల 11 నుంచి 22వ తేదీ వరకు జాతీయ స్థాయిలో జరిగే స్కేటింగ్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొనడానికి రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) కళాశాలకు చెందిన సిఎస్ఇ విద్యార్థి ఎం.హర్షవర్ధన అర్హత సాధించాడని జీవీపీ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ కెప్టెన్ ఆర్‌బి.అనంతరావు శనివారం తెలిపారు. జీవీపీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రజని విద్యార్థిని అభినందించారు.

## సాధికార కమిటీ కో-ఆర్డినేటర్‌గా ఆనంద్‌బాబు



ప్రజాశక్తి -పిఎం పాలెం : తూర్పు కాపు, గాజుల కాపు, కొప్పులవెలమ, కూరాకుల, పొందర కులాల టిడిపి రాష్ట్ర సాధికార కమిటీల కో-ఆర్డినేటర్‌గా పిఎం పాలెం ప్రాంతానికి చెందిన టిడిపి రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనంద్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ, తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు భీమిలి టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబుకు, టిడిపి బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతను పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.

## కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : డీసెంట్ షొటోకాన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 10, 11 తేదీల్లో విశాఖ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జివిఎంసి నాల్గో వార్డుకు చెందిన వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు జెడ్ఎస్‌కెఐ ఉత్తరాంధ్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వి.శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్‌షి టోర్యు కరాటే దూ అసోసియేషన్‌లో వీరంతా శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. ఐఎన్ఎస్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థిని వాసవల్లి భారతి రజత పతకం, మంగమారిపేటకు చెందిన జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి యగ్నేష్ రజత పతకం, గరికిన మైత్రేష్ కాంస్య పతకం, నేరెళ్ళ వలస కాలనీ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి ఊళ్ళ హర్షత్ కాంస్య పతకం, చిన ఉప్పాడ ఎంపి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని వాసపల్లి నివేదిత కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

# నిర్వాసితులకు న్యాయమైన ప్యాకేజీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మాజీ

**ప్రజాశక్తి -మునగపాక రూరల్:** నిర్వాసితులకు న్యాయబద్ధమైన ప్యాకేజీని ప్రకటించాలని నిర్వాసితుల సంక్షేమ సంఘం కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో అనకాపల్లి, అచ్చుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ అచ్చుతాపురం, అనకాపల్లి రోడ్డు మార్గ నిర్వాసితులు 1200 మంది పైచిలుకు ఉన్నారని, ఈనెల ఎనిమిదవ తారీఖున అనకాపల్లి ఆర్డీవో చిన్నికష్ణ నాగులపల్లి, మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల నిర్వాసితులతో సమావేశానికి ఉదయం 11 గంటలకు వస్తానని మూడు గంటలకు రావడం, కొద్దిపాటి మందితోనే అరకొర సమావేశం నిర్వహించి అయిందనిపించడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. పంట భూములకు గజానికి రూ. 8,000, వాణిజ్య సముదాయాలకు రూ. 16,000 లు పరిహారం అందిస్తామని, ఇదే ఆఖరు సమావేశమని, ప్యాకేజీకి ఒప్పుకోకపోతే, అసలు పరిహారమే దక్కదని బెదిరించడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించకుండా ప్యాకేజీని ప్రకటించడాన్ని నిర్వాసితుల సంఘంగా ఖండిస్తున్నామన్నారు. పంట భూములకు, వాణిజ్య సముదాయాలకు గజానికి రూ. 25,వేలు చెల్లించాలని, పరిహారం విషయంలో అన్ని గ్రామాలకు సమన్యాయం జరగాలని, జిరాయితీ, ఆర్అండ్‌బి స్థలాలలో ఇల్లు కోల్పోతున్న వారికి ఐదు సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని, చిరు వ్యాపారులను ఆదుకోవాలని, పూర్తిస్థాయిలో ఇల్లు కోల్పోతున్న కుటుంబంలోని యువకులకు ఎస్ఇజెడ్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు బుద్ధ రంగారావుతో పాటుగా పలు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

## 17 నుంచి వినియోగదారుల వారోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టిఐ ఉద్యమకర్త కాండ్రేగుల

**ప్రజాశక్తి -అనకాపల్లి** : ఈనెల 17 నుంచి 24 వరకు జాతీయ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్‌టిఐ ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. వినియోగదారుల కమిషన్లలో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడం ప్రధాన అంశంగా వారోత్సవాల్లో వివరిస్తామన్నారు.. ఆదివారం స్థానిక గౌరీ గ్రంథాలయంలో జిల్లా వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కొత్త వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఆన్లైన్ వినియోగదారుల సమస్యలు పరిష్కార మార్గాలు, వ్యాపారుల తప్పుడు మభ్యపెట్టే ప్రకటనలు, డిస్కౌంట్, వినియోగదారుల కమిషన్ల ప్రాధాన్యత వంటి అంశాలపై తెలియజేస్తామన్నారు. సమావేశంలో కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, ఆదర్శ వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు బి త్రినాధరాజు, జగప్పారావు పాల్గొన్నారు.

## కోతుల గుంపు దాడిలో
# బొప్పాయి తోట ధ్వంసం


ధ్వంసమైన బొప్పాయి తోట


చెట్లపై హల్‌చల్ చేస్తున్న కోతుల గుంపు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట** : బుచ్చయ్యపేటలో రైతు వేసిన బొప్పాయి తోటను ఆదివారం కోతుల గుంపు ధ్వంసం చేసింది. గ్రామానికి చెందిన గంధం నాయుడు మెట్ట ప్రాంతంలో సుమారు ఎకరం భూమిలో ఆరు నెలల క్రితం బొప్పాయి తోట వేశాడు. ప్రస్తుతం కాయలు దశలో ఉంది. ఆదివారం ఉదయం వందల సంఖ్యలో కోతులు గుంపులుగా బొప్పాయి తోటలో పడి కాయలు పిందెలను తుంచేశాయని రైతు గంధం నాయుడు వాపోయాడు. మండలంలోపలు గ్రామాల్లో రైతులు వేసిన కూరగాయల పంట, చెరుకు తోటలను సైతం కోతులు ధ్వంసం చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కోతులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

# సహకార ఉద్యోగులకు జిఓ 36 అమలు చేయాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**ప్రజాశక్తి-అనకాపల్లి** : సహకార సంఘాల ఉద్యోగులందరికీ జిఓ 36 అమలు చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ మహాసభలు యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగభూషణరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల వల్ల ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నా రన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు అధికారులు డ్యూటు పద్దుల్లో పెడుతున్నారన్నారు. అంటే తీసుకున్న జీతాలను తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని, దీనిని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈనెల 18, 19 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం అనకాపల్లి, అల్లూరి, విశాఖపట్నం జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి టి వెంకట రామయ్య, జిల్లా నాయకులు ఆర్ శివరామకష్ణ, కోశాధికారి ఈశ్వరరావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం వెంకటరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం చంద్ర స్వామి నాయుడు, జిల్లా నాయకులు లక్ష్మణరావు, బాబ్జి, సిఐటియు జిల్లా నాయకులు సత్యనారాయణ, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా నర్సీపట్నం గురుకులం విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో నర్సీపట్నం గురుకుల విద్యార్థులు

**ప్రజాశక్తి- కె కోటపాడు:** ఉన్నత విలువలతో ఎదుగుతూ, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న నర్సీపట్నం గురుకులం పూర్వ విద్యార్థులంతా ఆదర్శంగా నిలుస్తున్నారని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండారు రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం చౌడువాడలో 1983 నుంచి నేటివరకు నర్సీపట్నం గురుకుల పాఠశాలలో చదువుకున్న అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ గురుకులానికి చెంది 2500 మంది విద్యార్థుల్లో 30 మంది వైద్యులు, పలువురు రాష్ట్రస్థాయి అధికారులతో పాటు విదేశాల్లో స్థిరపడిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఏటా డిసెంబర్ రెండవ ఆదివారం జిల్లాలో ఏదో ఒక చోట కలుసుకొని పాఠశాలకు , ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తున్నామన్నారు. రూ.30 లక్షలు వెచ్చించి గురుకుల పాఠశాలలో అధునాతన లైబ్రరీని ఏర్పాటు చేశామని, గురుకులానికి క్రీడా సామాగ్రి, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. అందరూ సహపంక్తి భోజనం చేశారు. విద్యాబుద్ధులు నేర్పించిన నాటి గురువులను సన్మానించారు. 1997 బ్యాచ్ విద్యార్థి, డేన్ ఫౌండేషన్ అధినేత దొగ్గ అచ్చింనాయుడు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు చేశారు.

# మొక్కులు తీర్చుకున్న మంత్రి అమర్‌నాథ్


మంత్రి అమర్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

**ప్రజాశక్తి -అనకాపల్లి** : అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, దంతులూరి దిలీప్, గుడివాడ నాగమణి, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎఎంసి చైర్‌పర్సన్ పలక యశోద రవి, ఎంపిపి గొర్లి సూరిబాబు, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్, దాడి జయ వీర్, 80 వ వార్డు ఇన్చార్జ్ కొణతాల భాస్కరరావు, కొణతాల మురళీకృష్ణ, డాక్టర్ రామ్మూర్తి వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలంటీర్ వ్యవస్థపై
# తప్పుడు కథనాలు సరికాదు
### ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


బూడి ముత్యాలనాయుడు.

**ప్రజాశక్తి- దేవరపల్లి :** పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్న వాలంటీర్ వ్యవస్థపై తప్పుడు రాతలు రాయడం భావ్యం కాదని, ఇకనైనా మానుకుని వాస్తవాలను ప్రచురించాలని ఒక ప్రముఖ పత్రికను ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు. అన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక ప్రతి నెలా ఒకటో తారీఖు వృద్ధులకు, వికలాంగులకు, ఇతర పింఛనుదారులకు పింఛన్లు అందించడం, ప్రజలకు అవసరమైన సేవనుల నిస్వార్థంగా అందిస్తున్న వాలంటీర్లపై దుష్ప్రచారం చేసే రాతలు అమానుషమన్నారు. ప్రజలను వెతిక్కివెతికి అర్హులను గుర్తించి, సీఎం జగన్ పరిపాలనలో అభివృద్ధి సంక్షేమ ఫలాలను అర్హులకు అందించడం ద్వారా వాలంటీర్ వ్యవస్థ జవాబుదారీతనం తెచ్చిందన్నారు. టిడిపి పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా కొందరికే అందే పథకాలు, ఇపుడు వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్ల ద్వారా పార్టీలకతతంగా పథకాలు అందిస్తున్నామన్నారు.

# చెరుకు రవాణా ప్రారంభం


చెరుకు రవాణా ప్రారంభిస్తున్న బాబూరావు, రామనాయుడు

**ప్రజాశక్తి- దేవరాపల్లి:** మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు కొనుగోలు కేంద్రం వద్ద ఈ ఏడాది క్రషింగ్‌కు చెరకు తరలింపును వైసిపి మండల అధ్యక్షుడు స్థానిక సర్పంచ్ బూరె బాబురావు, మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ అన్నం రామనాయుడు ఆదివారం ప్రారంభించారు. . కొనుగోలు కేంద్రం వద్ద ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చెరకు కొనుగోలు కేంద్రం పరిధి వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి, ఫీల్డ్ సిబ్బంది బేరా నారాయణరావు, దుస్య వెంకట రమణ, బుగత బాబురావు, రమేష్, రైతు సభ్యులు, గ్రామ పెద్దలు అన్నం రాము (మాజీ ఫీల్డ్ మేను), కొప్పాక అప్పల నాయుడు, వియ్యపు రాజబాబు, నున్నగొప్పల నరిసింగరావు, తుంపాల ఈశ్వరరావు, గరికి శంకర రావు పాల్గొన్నారు

## ఓటర్ల నమోదును పరిశీలించిన ఆర్‌డిఒ


ఓటర్ల నమోదుపై ప్రశ్నిస్తున్న ఆర్‌డిఒ హుస్సేన్

**ప్రజాశక్తి - పరవాడ:** పరవాడ మండలంలోని గొర్లివానిపాలెం గ్రామపంచాయతీ పరిధి దిబ్బల గొర్లివానిపాలెం పోలింగ్ బూత్ నెంబర్‌ను విశాఖ ఆర్‌డిఒ డి.హుస్సేన్ ఆదివారం సందర్శించారు. 18 ఏళ్లు నిండిన అందరూ పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చుటకు చర్యలు తీసుకోవాలని చనిపోయిన, శాశ్వత వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి ఫారం-7 జారీ చేసి అటువంటి ఒటర్లను తొలగించాలని సూచించారు. అందురు బిఎల్ఓ లు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఓటర్లకు నమోదుకు సంబంధించి వెన్నెలపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసారు. సక్రమంగా ఓటర్లను నమోదు చేసి రికార్డులను పొందుపరచాలని ఆదేశించారు పరవాడ డిప్యూటీ తహసీల్దార్ వరహాలు, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు.

## గోతులను పూడ్చరూ..



గోతులమయంగా తాళ్ళపాలెం, నర్సీపట్నం రోడ్డు

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్ నుంచి నర్సీపట్నం రోడ్డులో సంత మార్కెట్ వద్ద తారురోడ్డు నిండా గోతులమయమై అధ్వానంఆగా ఉందని ప్రజలు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రెండేళ్ల క్రితం తూతూమంత్రంగా గోతులు కప్పి చేతులు దులుపుకున్న అధికారులుతర్వాత ఈ రోడ్డువైపు కన్నెత్తి చూడడం మానేశారని, దీంతో పూర్తిగా రూపుకోల్పోయినట్లు రోడ్డంతా అధ్వానస్థితికి చేరుకుందని అంటున్నారు. ప్రధానంగా ఏజీన్సీ ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రెండు నెలల క్రితం రెండు లారీలు గోతులలో కూరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడిన సంగతితెలిసిందే. నిండా గోతులమయమై ఉన్న రోడ్డులో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడ, ఎంతలోతు గొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు, ముఖ్యంగా బైకిస్టులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి రాకపోకలుక వీలుగా తీర్చిదిద్దడంతోపాటు శాశ్వతంగా తారురోడ్డు లేదా సిమెంట్ రోడ్డుతో పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రిటైరైన తోటి మిత్రులకు పూర్వ విద్యార్థుల సత్కారం

**ప్రజాశక్తి-కశింకోట :** కశింకోట దురిశెట్టి పెద్ద నరసింహమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76 బ్యాచ్ ఆత్మీయ కలయిక ఆదివారం స్థానిక శ్రీ నూకంబిక దేవాలయ ఆవరణలో ఆళ్ళ ఓంరామ్ అధ్యక్షతన జరిగినది. పూర్వ విద్యార్థులలో 60 ఏళ్లు నిండి, ఉద్యోగ విరమణ చేసిన వారిని, అలాగే అరవై ఏళ్లు నిండిన వారిని తోటిమిత్రులురామాల రమణమ్మ (వేణమ్మ) రాధాకష్ణ, కే వెంకటేశ్వరరావు, పాలూరి కామేశ్వరరావు, అమెరికాలో స్థిరపడిన మల్ల అప్పల సత్యనారాయణ, కంచపు సత్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పిఎస్‌టిఎస్ రావు, కే గోపాలరావు, వెలుగులు బాబురావు, పాలూరు కృష్ణారావు, జీ కమలకుమార్, పూర్వ ఎంఇఒ నంబ రమణ పాల్గొన్నారు.

**మునగపాక రూరల్:** 1987- 88 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం మండలంలోని అరబుపాలెం గ్రామంలోని ముసలితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. సుమారు 90 మందితో కూడిన ఈ సమావేశంలో మహిళలు, పురుషులు పాల్గొని ఆనందంగా ఆటపాటలతో గడిపారు. ఆనాటి విద్యార్థి దశలో పాత స్మృతులను నెమరు వేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. రానున్న 2023లో డిసెంబర్‌లో తమ బ్యాచ్‌కు 35ఏళు పూర్తవుతున్న సందర్భంగా కుటుంబ సభ్యులతో స్థానిక జిల్లా పరిషత్ స్కూల్లో కలవాలని నిర్ణయించారు.



మునగపాకలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

# వర్షంలోనూ నేవీ నిర్వాసితుల ఆందోళన



నాబ్ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

**ప్రజాశక్తి - రాంబిల్లి :** నాబ్ నిర్వాసితులను సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, నాబ్ మెయిన్ గేట్ వద్ద ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు రాంబిల్లి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి వీడకుండా కురుస్తున్న వర్షంలో మొక్కవోని దీక్షతో నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. నేటికి 42రోజులుగా నేవీ మెయిన్ గేట్ ముందు వేలాదిమంది నిర్వాసితులు పిల్లలు, మహిళలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం అధికారులు పట్టించుకోకపోవడంపై సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నేవీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే పెద్ద ఎత్తిన ఆందోళన చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి నేతలు పాల్గొన్నారు.



ఎంపీ సత్యవతికి వినతిపత్రం ఇస్తున్న జెఎసి నేతలు

**ఎంపీ సత్యవతి, మంత్రి అమర్‌కు వినతి**

నాబ్ మెయిన్‌గేటు వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితుల సమస్యలపై జెఎసి ఆధ్వర్యంలో ప్రతినిధులు బృందం అనకాపల్లి వెళ్లి ఎంపీ డాక్టర్ బీవీ.సత్యవతి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందించారు. నిర్వాసితుల సమస్యలపై ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జెఎసి నేతలు వేడుకున్నారు.

# విస్సన్నపేట భూములను పరిశీలించరేం?

### భూకుంభకోణంలో రెవెన్యూ అధికారులకూ పాత్ర :మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

**ప్రజాశక్తి - కశింకోట :**.విస్సన్నపేట భూముల కుంభకోణంలో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం మండలంలోని తాళ్ళపాలెం టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో వందల ఎకరాల భూకుంభకోణం జరుగుతున్నా జిల్లా కలెక్టర్ ఎందుకు పరిశీలించడం లేదో అంతుచిక్కడం లేదన్నారు. ఒక్క సెంటు భూమిలో పేదవాడు ఇల్లు కట్టుకుంటే ఆగమేఘాల మీద వెళ్లి పోలీసులసాయంతో కూల్చేసే రెవెన్యూ అధికారులు, ఇప్పుడు విస్సన్నపేట భూముల వ్యవహారంలో ఉలుకూపలుకూ లేకుండా మిన్నకుండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వైసిపిపై టిడిపి చేస్తున్న పోరాటానికి ఒక్క మిస్డ్ కాల్‌తో ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు.

ఈ సందర్భంగా ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులందరూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళీ జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణ మూర్తి, పార్టీ నాయకులు వేగి గోపీకష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి సూర్యనారాయణ, కుంద్రపు అప్పునాయుడు,బుద్దిరెడ్డి గంగయ్య, కరణం గోవింద తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి మండల అధ్యక్ష పదవికి చిన్నారావు రాజీనామా

### ఎమ్మెల్యే హామీలను నెరవేర్చలేదని పదవిని వదులుకుంటున్నట్లు ప్రకటన

**ప్రజాశక్తి - పరవాడ:.** పరవాడ మండల వైసిపి అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు బొద్దపు చిన్నారావు ఆదివారం ప్రకటించారు. గడిచిన సాధారణ ఎన్నికల ప్రచారంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బొనంగి పంచాయతీ గ్రామాలకు విచ్చేసి.అర్హులైన ప్రతి ఒక్కరికి రాంకీ ఫార్మాసిటీలో, ఎన్టీపీసీ కంపెనీలో ఉద్యోగం, ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారని, అయితే నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. దీనిపై గతంలో పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో గతంలోనే మండల వైసిపి అధ్యక్ష పదవికి రాజీనామాకు సిద్ధమైతే తొందరపడవద్దని, అందరికీ న్యాయం చేస్తామని మరోమారు హామీనిచ్చారన్నారు. హామీ అమలు చేయకుంటే పార్టీకి నష్టం వస్తుందని అధ్యక్ష హోదాలో ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడమే కాకుండా, ఎమ్మెల్యే సామాజిక వర్గానికి చెందిన ఒకరిని పరవాడ మండలానికి షాడోఎమ్మెల్యేగా నియమించి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వాళ్లిద్దరూ పార్టీ కార్యకర్తలకు, కాపు సామాజిక వర్గానికి చేస్తున్న అన్యాయం సహించలేక రాజీనామా చేశానన్నారు. అంతేకాక రాంకీ ఫైర్‌స్టేషన్‌లో 16 ఉద్యోగాలను ఒక్కొక్కటికీ రూ.రెండు లక్షలకు అమ్మేసి, చోడవరం నియోజకవర్గానికి చెందిన వారిని నియమించారన్నారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన నిర్వాసితులను కాది,ఇతర ప్రాంతాల వ్యక్తులకు ఉద్యోగ, ఉపాధికల్పనలో ప్రాధాన్యతనిస్తుండడంతో కలత చెంది పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నానని చిన్నారావు ప్రకటించారు.. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా, లేబర్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న పరవాడ జెడ్‌పిటిసి తీరును విమర్శించారు నిర్వాసితులకు ఫార్మాసిటీలో ఉద్యోగాల కల్పనకు పోరాటం చేస్తామని తెలిపారు.

## నూతన అధ్యక్షునిగా రామారావు

పరవాడ మండల వైసిపి నూతన అధ్యక్షుడిగా రావాడ పంచాయతీకి చెందిన సీనియర్ నాయకులు కోన రామారావును ఆపార్టీ నియమించింది. పెందుర్తి నియోజకవర్గ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచనలతో, జిల్లా పార్టీ అధ్యక్షులు కరణం ధర్మశ్రీ ఆదేశాలతో కోన రామారావును నియమించినట్లు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో పార్టీనీ బలోపేతం చేసి పార్టీలో సీనియర్లను, అనుభవజ్ఞులు, ప్రజాప్రతినిధులను, కార్యకర్తలను సమన్వయంతో పనిచేయాలని, భవిష్యత్తులో పార్టీ గెలుపునకు అన్ని విధాలుగా కషి చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సూచించినట్లు తెలిసింది.

# వీఆర్‌ఒల సంఘ ఎన్నికలు



ఎన్నికైన వీఆర్‌ఒల సంఘం ప్రతినిధులు

**ప్రజాశక్తి. -సబ్బవరం.:** విశాఖ జిల్లా ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ ఎన్నికలు మండలంలోని ఇరువాడలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కార్యక్రమంలో వీఆర్‌ఒల సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్లె శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వీఆర్‌ఒలు కషి చేయాలని కోరారు, గతంలో కరణం, మునసబు ల పాలన నుండి ప్రస్తుత వీఆర్‌ఒల వరకు సేవలందించిన ప్రతి ఒక్కరికీ వారి గౌరవానికి తక్కువ కాకుండా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక స్థానాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు

అనకాపల్లి జిల్లా వీఆర్‌ఒల సంఘ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఎస్‌టి. రామకాసు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఉమ్మడి జిల్లాల వీఆర్‌ఒల సంఘ ఎన్నికలు జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. నూతన కమిటీ ప్రతి సభ్యుని శ్రేయస్సు కోసం పనిచేస్తుందన్నారు.

**వీఆర్‌ఒలు సంఘం నూతన కార్యవర్గం**

విశాఖ జిల్లా వీఆర్‌ఒ సంఘ అధ్యక్షులుగా కె. వెంకట అప్పారావు, కార్యదర్శి దేవరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా ఎస్. టి. రామకాసు,ప్రధాన కార్యదర్శిగా అనంతరాజు, వైస్ ప్రెసిడెంట్ గా శివ జోగినాయుడు, నరసింహమూర్తి రామునాయుడు,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిట్టిబాబు, సింహాచలం నాయుడు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ ప్రాజెక్టు ప్రారంభం



ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ నగర పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్టును ఆదివారం ప్రారంభించారు. రోటరీ ఫౌండేషన్, రోటరీ క్లబ్స్, ఎన్‌జిఒలు, కార్పొరేట్ దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ప్రాజెక్టుకు అరబిందో ఫార్మా రూ.25 లక్షలను విరాళంగా అందజేసిందని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఉదయ్ ఫిలానీ తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వేగంగా తగ్గించి, పర్యావరణాన్ని కాపాడేందుకు, ప్రపంచాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడేందుకు మనం చేయగలిగిందంతా చేయాలని అన్నారు. ఈ ప్రాజెక్టు అమెరికాలో స్థిరపడిన విజయనగరానికి చెందిన వ్యర్థ పదార్థాల నిర్వహణలో ప్రముఖుడైన ప్రకాశం తాత ఆలోచన మేరకు చేపట్టడం జరిగిందన్నారు. సురక్షిత నీరు, అక్షరాస్యత, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సాధికారిత, పర్యావరణం వంటి రంగాలలో ప్రాజెక్టులను చేపట్టడంలో మొయినాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ ఎంతగానో గుర్తింపు చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ క్లబ్‌కు చెందిన పతంజలిరావు, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రాజశేఖర్ రెడ్డి, అరబిందో సంస్థ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కన్నన్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి కేంద్రాల నిర్వాహకులతో సమావేశం

**ప్రజాశక్తి - కశింకోట :** మండలంలోని తాళ్ళపాలెంలో శక్తి కేంద్రాల నిర్వాహకులతో మండల ప్రవాస్ యోజన భాగంలో ఆదివారం కశింకోట మండల ప్రవాస్ యోజన ఇన్‌ఛార్జి మళ్ల కాళేశ్వరరావు ఆద్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ సర్పంచ్ పొన్నగంటి అప్పారావు, కరక సత్యనారాయణ, అప్పికొండ అప్పారావు, ఎమ్ చిరంజీవి, పంచాడ గంగరాజు పాల్గొన్నారు.



గడ్డి కోత యంత్రాలు

## రాయితీపై గడ్డి కోత యంత్రాలు

**ప్రజాశక్తి-రోలుగుంట:**3 బ్లేడ్‌ల విద్యుత్‌తో నడిచే జెడ్‌హెచ్‌పి సామర్థ్యం ఉన్న గడ్డి కోత యంత్రాలు (ఛాప్ కట్టర్)ను పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ 40 శాతం రాయితీపై పంపిణీ చేస్తుందని స్థానిక పశుసంవర్ధకశాఖ అధికారి జి.నూకేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, దీని ఖరీదు రూ.33970. రాయితీ రూ.13,588కాగా రైతు చెల్లించాల్సింది రూ.20,382. అధిక పాల ఉత్పత్తికి మెరుగైన ఉత్పత్తి సామర్థ్యంకు ప్రతీ పాడి రైతు తమ పశువులకు అందించే మేత 3/4 వంతు పచ్చగడ్డిని అందించాలని ఆయన అన్నారు. సూపర్ సేపియర్ బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసి ఛాప్ కట్టర్ ద్వారా ముక్కలు చేసి పశువులకు అందించడంతో మేత వృథాను అరికట్టడమే కాకుండా గడ్డిలో పోషకాలను పశువుల శరీరం సంపూర్ణంగా, సులభంగా గ్రహిస్తుందన్నారు. దీంతో అధిక ఉత్పత్తి, తక్కువ ఖర్చుతో రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. వీటిని కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాలు లేదా సమీప పశువైద్యశాలలో ఆధార్ కార్డు పట్టాపుస్తకంతో సంప్రదించాలన్నారు.



విరాళం ఇస్తున్న దాతలు

## రూ.50 వేల విరాళం

**ప్రజాశక్తి- చీడికాడ:**మండల కేంద్రంలో శివాలయం వద్ద గంగాదేవి కొనాములో దుర్గాదేవి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. చీడికాడకు చెందిన ముద్రు సుదీక్షణ అమ్మవారి ఆలయం నిర్మాణంకు రూ.50 వేలు తన వంతు సహాయంగా శ్రీ దుర్గాదేవి సేవా సంఘం ఉత్సవ కమిటీకి అందించారు. విరాళం అందించిన సుదీక్షణకి శ్రీ దుర్గాదేవి సేవా సంఘం ఉత్సవ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

## నేడు కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని కొంగసింగిలో ఈ నెల 12న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖపట్నం ఐ హాస్పిటల్ వైద్యులు కంటి తనిఖీలు చేసి అవసరమైన వారికి మందులు, ఆపరేషన్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి- చీడికాడ:**మండలంలోని జి.కొత్తపల్లి శివారు ఐశ్వర్య వనంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన చేశారు. విశాఖపట్నం కి చెందిన ఆచార్యులు తన సొంత నిధులు, దాతల సహకారంతో ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ముద్రు ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుల చేతుల మీదుగా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లిసూరి నాయుడు, మాజీ సర్పంచ్ పైడి నాయుడు, మాజీ ఎంపిటిసి అప్పలనాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, కార్యకర్తలు పాత్రని సురేష్ అద్దిపల్లి చిన్న అప్పారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

# బహుజనులు ఏకతాటిపై నడవాలి

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :**స్థానిక రోటరీ క్లబ్‌లో బీఎస్పీ ట్రేడర్ క్యాంప్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బొట్టా నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు జి.పరంజ్యోతి మాట్లాడుతూ, బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రాజ్యాధికారం చేపడితేనే దేశంలో, రాష్టంలోనూ స్వేచ్ఛ వస్తుందని తెలిపారు. కుల, మత పేరిట మనమధ్య విద్వేషాలు రెచ్చగొట్టి అగ్రకులాలు మాత్రమే రాజ్యాధికారం పొందుతు న్నారన్నారు. దీంతో, బహుజనులు ఇంకా వెనకబడి పోతున్నారని ఆవేదన చెందారు. మహాత్మా గాంధీ, జ్యోతిరావు పూలే, అంబేద్కర్, కాన్షిరాం వంటి మేధావుల బాటలో ఏకతాటిపై బహుజనులందరూ నడచి, రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు బోని కృష్ణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు చిన్నారావు, విశాఖజిల్లా ఉపాధక్షులు రాజు, నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు గంగాధర్, చిరంజీవి, సంజీవ్, పోలోజు నాగేశ్వరరావు, అప్పలనాయుడు ,శేషగిరి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

# చెరుకు రైతులను ఆదుకోవాలి


**ప్రజాశక్తి -రావికమతం:**

చెరుకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు గెంజ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, గోవాడ షుగర్స్ ఫ్యాక్టరీలో రైతులను ఆదుకునేందుకు గాను ముందుగా వారికి పెట్టుబడి నిమిత్తం సొమ్మును చెల్లించి, చెరుకును ఫ్యాక్టరీకి తీసుకోవాలని తెలిపారు. కనీసం టన్నుకు రూ.3500 తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరుకు ఫ్యాక్టరీకి తరలించిన 15 రోజుల్లోపు బకాయిలు చెల్లించాలని తెలిపారు. గత ఏడాది రైతులు 100శాతం చెరకు పంట వేస్తే ఈ ఏడాది కనీసం 60శాతం కూడా వేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఐదు లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం కాగా ఈ ఏడాది కేవలం మూడు లక్షల 50 వేలకు తగ్గించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు. పంట సాగు ఖర్చులు పెరగడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోనే రైతులు చెరుకు పంట వేయటానికి ఆసక్తి చూపలేదన్నారు. రానున్న రోజుల్లో ఫ్యాక్టరీని ప్రైవేటు చేతుల్లోకి అప్పగించేందుకే రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వలేదన్నారు.గత ఏడాది చెరకు రైతులకు ఏడాది పొడవునా డబ్బులు చెల్లించకపోవడం పట్ల రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఫ్యాక్టరీలను సమర్థవంతంగా నడిపించేందుకు చర్యలు చేపట్టలేని దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ స్పందించి చెరకు రైతుల పట్ల దృష్టి సారించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఎస్‌ఎస్‌ఎ కళాశాలలో ఎంట్రన్స్ పరీక్షలు

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండలంలో పాముల వాక గ్రామంలో ఎస్ఎస్ఏ జూనియర్ కళాశాలలో ఈనెల 18 నుండి జనవరి 8 వరకు ఏపీ పోలీ సెట్, ఐఐఐటి, ఏపీఆర్జేసీ, ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంట్రన్స్ పరీక్షల్లో మొదటి 10ర్యాంక్ సాధించిన వారికి ఉచితంగా కోచింగ్ ఇవ్వబడుతుందన్నారు.గతంలో కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సందర్భంగా తెలిపారు. కళాశాలలో హాస్టల్ వసతి సౌకర్యం కలగజేస్తున్నామని, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సదా అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.

కరస్పాండెంట్ సాయికుమార్



# స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.నిరుద్యోగ యువతలకు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రముఖ ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఉద్యోగం కల్పించనున్నారు. జెనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సును అందిస్తున్నారు. పదవ తరగతి అభ్యర్థులు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి చాముండేశ్వరావు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్:9000092227 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బయో డేటా,ఆధార్ కార్డు, ఫోటోలతో స్కిల్ హబ్ వద్ద వద్ద సంప్రదించాలని తెలిపారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

## పలు చోట్ల శ్రమదానం

**ప్రజాశక్తి -చీడికాడ:**మండంలోని మంచాల గ్రామంలో రోడ్డు, బిసి కాలనీ నుండి బోను వారి కల్లాలు, బ్రాహ్మణ , ఒలేటి, దాసరాబంద చెరువు పొలాల మార్గంలో పెరిగిన తుప్పలను స్థానిక వైసీపీ నాయకులు పాటూరి రమణ గ్రామస్తులు, యువకులతో కలిసి శ్రమధానంతో తొలగించారు. ఈ సందర్భంగా రమణ విలేకరులతో మాట్లాడుతూ, ఈ రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, రాష్ట ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలయుడు ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి అప్పలనాయుడు, బోను వరాహమూర్తి, బోను లోవ, బోను శ్రీను, మతల జగన్నాధం, కే.కన్నంనాయుడు, జి.వరాహమూర్తి పాల్గొన్నారు.



తుప్పలు తొలగిస్తున్న వైసిపి నాయకులు




ఆందోళన చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

## 375వ రోజుకు మత్స్యకారుల ధర్నా

**ప్రజాశక్తి-నక్కపల్లి:**హెటిరో పైప్ లైన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైప్ లైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 375వ రోజుకు చేరింది .వర్షం లోనూ మత్స్యకారులు ధర్నాను కొనసాగించారు.ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారులకు నష్టం చేకూర్చే పైపులైనుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. మత్స్యకారులు తలపెట్టిన ధర్నాకు మద్దతును ప్రకటించారు. కంపెనీ కాలుష్యం కారణంగా మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి, మత్స్యకార యువత తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తకు అవార్డు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని ఏఎల్‌పురం అంగన్వాడీ కార్యకర్త ఎం.మంగతాయి ఉత్తమ అవార్డు పొందారు. ఈ మేరకు అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు తరపున ఏఎల్ పురం సెక్టార్ నుంచి ఎం.మంగతాయి, రోలుగుంట సెక్టార్ నుంచి ఎ.జయ, నర్సీ పట్నం సెక్టార్ సిహెచ్. రామకృష్ణాదేవి ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక అయ్యారు. వీరిని తోటి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సిబ్బంది అభినందించారు.



అవార్డు స్వీకరిస్తున్న మంగతాయి



చేపడుతున్న పనులు

## రచ్చబండల మరమ్మతు పనులు

**ప్రజాశక్తి-రావికమతం:**కవగుంట గ్రామ పంచాయతీలో శిథిలావస్థకు చేరుకున్న రచ్చబండలను సర్పంచ్ దాసరి సూర్య కుమారివరహాలు ఆధ్వరాన మరమ్మతు పనులను చేపట్టారు. సుమారు 30 ఏళ్ల క్రితం కీర్తిశేషులు, మాజీ సర్పంచ్ దాసరి రామనాయుడు నిర్మించిన రచ్చబండ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుత గ్రామ సర్పంచ్ ఆదివారం మరమ్మతు పనులను ప్రారంభించారు. అప్పట్లో ప్రతి కాలనీకి ఒక రచ్చబండ చొప్పున ఐదు రచ్చబండలను ఏర్పాటు చేశారన్నారు. యధావిధిగా వీటిని వాడుకలోకి తీసుకు రావడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సొంత డబ్బులతో ముందుగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**మండల కేంద్రంలోని వినయ్ విద్యా సంస్థలో అంగరంగ వైభవంగా చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. 20 మండలాల నుండి 150 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రథమ బహుమతి మాకవరపాలెం గిడుతురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి ఏపీ మోడల్ స్కూల్ (వేములపూడి) సాధించాయి. ప్రైవేట్ పాఠశాల నుండి మొదటి బహుమతి శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ద్వితీయ బహుమతి భవాని విద్యానికేతన్ (అచ్యుతాపురం) గెలుచుకున్నాయి. మొదటి స్థానం సాధించిన వారు కడపలో జరుగు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు కే.త్రిమూర్తులు, వెంకటేశ్వర మాస్టారు, వినయ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బత్తులు వాసు, పాల్గొన్నారు.



బహుమతులు ఇస్తున్న జెవివి ప్రతినిధులు

# ఉక్కుపై 'దీపం' కార్యదర్శి వ్యాఖ్యలు దారుణం

## సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ ఉక్కు పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లో అమ్మి తీరుతామని దీపం సెక్రటరీ తుహీన్ కాంత్ పాండే చేసిన వ్యాఖ్యలను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. రెండేళ్లుగా ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల ఆస్తి అని, ఎందరో కార్మికుల త్యాగాలతో ఈ కర్మాగారం ఏర్పడిందని గుర్తు చేశారు. దీపం సెక్రటరీ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలని, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావుకు విశాఖపట్నం పట్ల, ఇక్కడ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే మోడీపై ఒత్తిడి తీసుకు వచ్చి స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకునేలా చేయాలని, లేదంటే ఆయన పదవికి రాజీనామా చేయాలని సవాలు విసిరారు. లేనిపక్షంలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు ఆయనకు తప్పక గుణపాఠం చెబుతారని జగ్గునాయుడు హెచ్చరించారు.

## దళిత మహిళలపై అత్యాచారాలు అరికట్టాలి

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**దళిత మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని రెల్లి హక్కుల సాధన కమిటీ జిల్లా మహిళా కార్యదర్శి యర్రంశెట్టి మౌనిక డిమాండ్ చేశారు. చెట్టుపల్లి గ్రామంలో విలేకర్లతో ఆమె ఆదివారం మాట్లాడుతూ, మహిళల రక్షణకు కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా అవి సక్రంగా అమలు కాలేదని, అందుకే నేరాలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం మహిళల రక్షణకు ఎన్నో కఠిన చట్టాలు, గృహహింస వరకట్నం, దిశా చట్టం, కాల్ సెంటర్లు ఉన్నప్పటికీ అవి అమలు చేయడంలో విఫలమవు తున్నాయని మౌనిక ఆవేదన వ్యక్తం చేశారు. దిశ చట్టం ఎంతో పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహిళల పోరాటాలతో చట్టాలు తీసుకు వస్తే వాటిని కొంతకాలానికే పరిమితం చేస్తున్నారన్నారు. కొందరి ఒత్తిడిల కారణంగా చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయన్నారు. చట్టాలు కఠినంగా అమలు చేసినప్పుడు నేరాలు చేసే వారిలో భయం పుడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, కనక లక్ష్మీ, వరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మౌనిక, తదితరులు

# చి వరి ఆశలపై నీళ్లు

**▶▶ కొంపముంచిన అకాల వర్షం ▶▶ పొలాల్లో ఉన్న కోసిన వరి పనలు ▶▶ నేలమట్టమైన చేను**

**ప్రజాశక్తి-నక్కపల్లి:**అకాల వర్షం రైతన్నల కొంపముంచింది. వరి పంట చేతికందే సమయంలో వర్షం కారణంగా నష్టాన్ని మిగిల్చింది. అకాల వర్షం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఆదివారం కూడా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వరి చేను నేలకు ఒరిగిపోగా, పంట పొలాల్లో ఉన్న కోసిన వరి పనలు పూర్తిగా తడిసిపోయాయి. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి వరి పంట సర్వనాశనం అయ్యింది. కోసిన వరి చేను కుప్పలు వేయడానికి అవకాశం లేకపోవడంతో రైతులు పొలాల్లోనే ఉంచడంతో మూడు రోజుల నుండి కురిసిన వర్షానికి వరి పనలు తడిసిపోవడంతో ధాన్యం గింజలు రాలి పోతాయని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోత దశలో ఉన్న వరి చేను నేల కొరిగి పోవడంతో ,రైతులు వాటిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.ఒక పక్క వర్షం కురుస్తున్నప్పటికీ గత్యంతరం లేక రైతులు కోతలు కోస్తున్నారు.వర్షం కారణంగా వరి పంట దెబ్బతినడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతులు సూచనలు పాటించాలి**

వరి పంట కోతకు వచ్చిన దశలో వర్షం కారణంగా ధాన్యం గింజలు, మొలక రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. కోత దశలో ఉన్న వరి వెన్నుల మీద లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేయాలని సూచించారు. పైరు పనలు తడిస్తే లీటర్ నీటికి 50 గ్రాములు ఉప్పును కలిపి వరి కంకులను ముంచి ఆరబెట్టి చిన్నచిన్న కుప్పలుగా వేయాలన్నారు.

**కోటవురట్ల:**తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షపాతం నమోదయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పంట పొలాలు, ప్రధానంగా కోతలు పూర్తయిన వరి పంట పూర్తిగా దెబ్బతింది. శనివారం రాత్రి నుండి మొదలైన వర్షాలు ఆదివారం మరి కాస్త ఎక్కువ అయ్యాయి. కొన్నిచోట్ల కోసిన వరి పంటను రైతులు చేసేది ఏమీ లేక పొలంలోనే వదిలేశారు. అదేవిధంగా కోతకు సిద్ధంగా ఉన్న పంట సైతం వర్షానికి దెబ్బ తింటుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట తడిసి పోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.



అనకాపల్లి, దేవరాపల్లిలో తడిసిన వరి పనలు

**స్పందించని సచివాలయాల సిబ్బంది**

ఇదిలా ఉండగా మండల కేంద్రం, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ఎవరు అందుబాటులో లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేకపోవడంతో రైతన్న దిగాలిగా ఎదురుచూస్తున్నాడు.

**నేలకు ఒరిగిన వరి**

**మాకవరపాలెం:** మండలంలో ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లు కురిసాయి. శనివారం, ఆదివారం పడిన జల్లులకు పల్లపు ప్రాంతంలో నీరు చేరింది. మరో పక్క కోసేందుకు సిద్ధంగా వరి పంట తుఫాను గాలులకు మండలంలో మాకవరపాలెం, చంద్రయ్యపాలెం, తామరం, కొండలఅగ్రహారం, గిడుతూరు గ్రామాల్లో వరి చేలు నేలకు ఒరిగాయి. కొన్నిచోట్ల కోసిన వరి చేనులు తడిచి పోయాయి.

**చీడికాడ:**గత మూడు రోజులుగా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి పైరు పాడవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. నాలుగు నెలలుగా శ్రమించి పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే దశలో పంట ప్రకృతి కారణంగా వర్షాల పాలు కావడంతో ఏమి చేయాలో తెలీక దిక్కు తోచని తెలిస్థితిలో రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన పంటకి గిట్టుబాటు ధర రాదని, దళారీలకే అమ్ముకోవాల్సి వస్తుందని దీనంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**అనకాపల్లి :** మరికొద్ది రోజుల్లో వరి పంట చేతికందుతుందన్న తరుణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నేలమట్టం అయింది. పట్టణంలో సౌత్ 2లో అత్యధికంగా వరి పంట నేలకొరిగింది. నిన్న మొన్నటి దాకా ఆశాజనకంగా ఉన్న పైర్లను చూసి మంచి దిగుబడులు వస్తాయని మురిసిపోయిన రైతన్నల ఆశలపై ఈ వర్షాలు నీళ్లు జల్లాయి. మరో రెండు మూడు రోజులపాటు ఇలాగే వర్షాలు కురిస్తే వరి పంట మొలకెత్తే పరిస్థితి ఉందని వాపోతున్నారు.

**దేవరాపల్లి :** మండలంలోని నాగయ్య పేట, కాశీపురం, పెదనందిపల్లి, చిన్న నందిపల్లి, తారువ, తిమిరం తదితర గ్రామాల్లో వరి పంటలు కోసి వర్షాలు కురవడంతో పొలాల్లోనే కొంతమంది చిన్నచిన్న కుప్పలు వేశారు మరికొందరు అవకాశం లేకపోవడంతో కోసిన పంట కోసినట్టే వదిలేశారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో చేను, ధాన్యం తడిసి పాడౌతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరిపైర్లతోపాటు మినుములు, పెసలు ఇతర పంటలకు నష్టం జరుగుతుందని రైతులు అంటున్నారు.

**బుచ్చయ్యపేట** : రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో రైతులు వంట పొలాల్లోనే కోసి విడిచిపెట్టిన వరి పంట నీట మునిగిపోయింది.మండలంలో గల చిన్నప్పన్నపాలెం ,వడ్డాది ,దిబిడి ,బుచ్చయ్యపేట, కందిపూడి ,తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట పంట పొలాల్లోనే తడుస్తూ ఉంది.

**మునగపాక రూరల్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే దశలో నీట మునగటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మాండోస్ తుపాను దాటికి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు నేల వాలాయి. వర్షం,దానికి తోడు బలమైన గాలులు వీయటంతో బరువెక్కిన కంకులతో కలకలలాడిన వరి పంట భూమి పాలై నీటిలో తడిసి ముద్దయి పంట కోత దశకు వచ్చే తరుణంలో నేల పాలవటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

**రాంబిల్లి :** మండలంలోని దిమిలి, తెరవపల్లి, కలవలపల్లి, వైలలోవ గ్రామాల్లో సుమారు 200 ఎకరాల వరిపైర్లు నేలవాలి, ముంపునకు గురయ్యాయని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు.



కోటవురట్లలో.. కోసిన వరి పనలు



చీడికాడలో.. పొలంలో చేరిన నీరు



మాకవరపాలెం, మునగపాకలో ఒరిగిన వరి పనలు